



# EVENING EDITION

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com


4PM
www.suryaa.com
బుధవారం
19 జూన్ 2024
పేజీలు: 02





# ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్ బాధ్యతలు

ఇన్నాళ్లు అభిమానులకు పవర్ స్టార్‌గా, తన కార్యకర్తలకు జనసేన అధినేతగానే పాపులర్ అయిన పవన్ కల్యాణ్, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. బుధవారం జూన్ 19న జనసేన ఛీఫ్ పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని డిప్యూటీ సీఎం క్యాంప్ ఆఫీస్‌లో పవన్ కళ్యాణ్ తనకు కేటాయించిన మంత్రిత్వ శాఖలు పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్, రూరల్ వాటర్ సప్లైస్, అటవీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక శాఖల బాధ్యతలను స్వీకరించారు. క్యాంప్ ఆఫీస్‌లో సరిగ్గా ఉదయం 10గంటల 47 నిమిషాలకు తన క్యాంప్ ఆఫీస్‌లో బాధ్యతలు స్వీకరించారు పవన్ కల్యాణ్. బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఇంద్రకీలాద్రి ఆలయ వేదపండితుల ఆశీర్వచనం అందించారు. బాధ్యతలు స్వీకరించగానే ఫైళ్లమీద పవన్ సంతకాలు చేశారు. అనంతరం ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో పవన్ భేటీ అవుతారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పవన్ కల్యాణ్‌కు జనసేన, టీడీపీ నేతలు అభినందనలు తెలిపారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, జనసేన నేత కొత్తపల్లి సుబ్బారాయుడు, నాదెండ్ల మనోహర్ తదితరులు పవన్‌కు



శుభాకాంక్షలు తెలిపారు.

**ఐదు శాఖల గురించి పవన్ ఇంకా ఏమన్నారంటే...**

"విశాఖ మన్యంలో పర్యటిస్తున్నపుడు కురిడి అనే గిరిజన గ్రామానికి వెళ్ళాను. ఆ గ్రామ ఆడపడుచులు గుక్కెడు నీళ్ళ కోసం తాము పడుతున్న అవస్థలను చెబుతూ, అక్కడి బావిలో కలుషితమైపోయిన నీటిని చూపించారు. ఆ ప్రాంతంలోనే తోటవలస గ్రామానికి వెళ్లినప్పుడు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆ ఊరివాళ్ళు వివరించారు. గోదావరి జిల్లాలకు వెళ్లినప్పుడు పలు మత్స్యకార గ్రామాలవాసులు తాగు నీటి కోసం ఎన్ని ప్రయాసలుపడుతున్నామో చెప్పారు. గ్రామీణ అభివృద్ధి - దేశాభివృద్ధి అనే నినాదం నామమాత్రంగా మిగిలిపోవడాన్ని గమనించాను. గుక్కెడు మంచి నీరు కోసం మైళ్ల దూరం వెళ్లి ప్రయాసతో బిందెడు నీరు తెచ్చుకుంటున్న ఆడపడుచుల అవస్థలు చూసాను.



## ఇవాళ రాహుల్ గాంధీ 54వ పుట్టిన రోజు

రాహుల్ గాంధీ.. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి మాజీ అధ్యక్షుడు. మన దేశ మొట్ట మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూకి ముని మనవడు. ఇందిరా గాంధీకి మనవడు. భారత దేశ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ కుమారుడు. అమేథీ నియోజక వర్గం నుంచి 2004 నుండి 2019 వరకు లోక సభ సభ్యునిగా పనిచేశాడు. 2019 లో వయనాడ్ నుండి లోకసభ సభ్యుడయ్యాడు. ఇప్పుడు ఆయన గురించి ఎందుకు చెబుతున్నామంటే.. ఇవాళ రాహుల్ గాంధీ 54వ పుట్టిన రోజు.



## రామోజీరావుకు నివాళులర్పించిన వైఎస్ షర్మిల

రామోజీ గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావుకు ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నివాళులర్పించారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో ఆయన చిత్రపటం వద్ద అంజలి ఘటించారు. అనంతరం రామోజీరావు సతీమణి రమాదేవి, మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్, రామోజీ ఫిల్మ్‌సిటీ ఎండీ విజయేశ్వరి సహా కుటుంబసభ్యులను పరామర్శించి.. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.



## ఏపీ హోం మంత్రిగా అనిత బాధ్యతల స్వీకరణ

ఆంధ్రప్రదేశ్ హోంమంత్రిగా వంగలపూడి అనిత బాధ్యతలను స్వీకరించారు. సచివాలయంలోని సెకండ్ బ్లాక్ లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వంగలపూడి అనిత బాధ్యతలను స్వీకరించారు. హోంమంత్రిగా బాధ్యతలను స్వీకరించిన వంగలపూడి అనితకు వేదపండితులు ఆశీర్వచనాలు అందచేశారు. పార్టీనేతలు, అధికారులు... హోంమంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో వంగలపూడి అనితను పార్టీ నేతలతో పాటు ఉన్నతాధికారులు కలసి అభినందనలు తెలిపారు. బొకేలను అందించి ఆమెకు శుభాకాంక్షలను అందించారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో ఒక మహిళ హోం మంత్రిగా బాధ్యతలను స్వీకరించడం ఇదే తొలిసారి. ఆమెతో పాటు కుటుంబ సభ్యులు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## ఎల్లుండి రాష్ట్ర కేబినెట్ భేటీ!

ఈ నెల 21న సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం జరగనుంది. ఆగస్టు 15లోగా రైతులకు పంట రుణాలు మాఫీ చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో ఈ అంశంపై చర్చించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు అసెంబ్లీ సమావేశాలు, బడ్జెట్ రూపకల్పనపై భేటీలో చర్చించనున్నట్లు సమాచారం.



## కెప్టెన్సీ నుంచి వైదొలగిన కేన్ విలియమ్సన్

2024 టీ20 ప్రపంచ కప్ నుంచి టాప్ టీమ్ అయిన న్యూజిలాండ్ ఎవరూ ఊహించని విధంగా ఎలిమినేట్ అయింది. గత సీజన్లో ఫైనల్ వరకు వెళ్లి రన్నరప్గా నిలిచిన న్యూజిలాండ్ జట్టు ఈ సీజన్ లో అనుకున్నంత రాణించలేక పోయింది. ప్లేయర్ల పేలవమైన ఫామ్ కి తోడు వర్షం కారణంగా కివీస్ జట్టు ఎలిమినేట్ అయింది. దీనికి బాధ్యతగా కెప్టెన్ విలియమ్సన్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. తమ జట్టు ఓటమికి బాధ్యత వహిస్తూ పరిమిత ఓవర్ల ఫార్మాట్ల కెప్టెన్సీ నుంచి తాను తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. అలాగే 2024-25 కాలానికి సంబంధించి న్యూజిలాండ్ సెంట్రల్ కాంట్రాక్టును కూడా కేన్ విలియమ్సన్ వదులుకున్నాడు. కాగా గతంలో ఆయన టెస్ట్ కెప్టెన్సీ బాధ్యతలు కూడా వదులుకున్న సంగతి తెలిసిందే. అయితే సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి వైదొలిగిన విలియమ్సన్ ప్లేయర్ గా ఆడుతాడా లేదా అనే విషయంలో క్లారిటీ రావాల్సి ఉంది.



## పాయల్ రాజ్‌పుత్ గ్లామర్ షో



తరచుగా హాట్ ఫోటో షూట్లతో వార్తల్లో ఉండే పాయల్ రాజ్ పుత్ ఇటీవల కాలంలో ఓ వివాదంలో ఇరుక్కుంది. ఈ బ్యూటీ రక్షణ అనే సినిమా ప్రచారాలకు రాలేదని ఆ మూవీ ప్రొడ్యూసర్స్ నిర్మాతల మండలిలో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ మూవీ కోసం 50 రోజుల కాల్షిట్స్ కేటాయించిన పాయల్ కేవలం 47 రోజులు మాత్రమే పని చేసి, ఆ తర్వాత మూడు రోజులు ప్రచారంలో పాల్గొనాల్సి ఉందని, కానీ ఈ అమ్మడు మాత్రం ప్రమోషన్స్ కు రావట్లేదు అంటూ తీవ్రంగా విమర్శించారు.ఇక ఈ బ్యూటీ అప్పుడప్పుడు బోల్డ్ ఫోటోషూట్స్ చేస్తూ తన అభిమానుల దృష్టి ఇతర హీరోయిన్లపై పడకుండా చూసుకుంటుంది. ఎంతమంది హీరోయిన్లు ఉన్నా పాయల్ వేరు అన్పించేలా ఫోటోలకు ఫోజులు ఇస్తుంది. తాజాగా షేర్ చేసిన ఫొటోల్లో ఆకు పచ్చ రంగులో ఉన్న ప్యాంట్, షర్ట్ వేసుకుని అందంగా కన్పించింది.


## టీడీపీకి 6వ స్థానం.. వైసీపీకి 15వ స్థానం

41 పార్టీలకు చెందిన ఎంపీలతో 18వ లోక్‌సభలో సభ్యుల సంఖ్యాపరంగా టీడీపీ 6వ అతిపెద్ద పార్టీగా నిలుస్తోంది. మొత్తం సభలో 240 మంది ఎంపీలతో బీజేపీ టాప్-1లో ఉండగా, కాంగ్రెస్-99, సమాజ్‌వాదీ పార్టీ-37, టీఎంసీ-29, డీఎంకే-22 స్థానాలతో టీడీపీ కంటే ముందున్నాయి. 16 మంది ఎంపీలతో టీడీపీ 6వ స్థానంలో ఉండగా, నలుగురు ఎంపీలున్న వైసీపీ 15వ స్థానంలో నిలిచింది.



## గ్రూప్2 అభ్యర్థులకు బిగ్ అలర్ట్

గ్రూప్-2 మెయిన్స్ దరఖాస్తులో పోస్టుల ప్రాధాన్యతను మార్చుకునేందుకు అభ్యర్థులకు ఏపీపీఎస్సీ అవకాశం కల్పించింది. పోస్టుల ప్రాధాన్యం, పరీక్ష కేంద్రాలు, మండల, జిల్లా ప్రాధాన్యతలను మార్చుకోవచ్చు. ఈ నెల 25వ తేదీ రాత్రి 11.59 వరకు మాత్రమే అవకాశం ఉంటుందని ఏపీపీఎస్సీ తెలిపింది. ఆ తర్వాత మరో అవకాశం ఉండదని స్పష్టం చేసింది.






## ఈవీఎంలు పోవాల్సిందే.. బ్యాలెట్ రావాల్సిందే: డీకే


ఈవీఎంల పనితీరుపై దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని కర్ణాటక మంత్రి డీకే శివకుమార్ అన్నారు. రాష్ట్రంలో బీజేపీ- జేడీఎస్ కూటమి అత్యధిక సీట్లు గెలవడానికి ఈవీఎంలే కారణమని ఆరోపించారు. ఈవీఎంలను తీసేసి.. మళ్లీ పోస్టల్ బ్యాలెట్ విధానం తేవాలని డిమాండ్ చేశారు. మధ్యప్రదేశ్‌లో 29 సీట్లకు గాను బీజేపీ 29 చోట్ల గెలవడం అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోందన్నారు. కాగా కర్ణాటకలో బీజేపీ 17, జేడీఎస్ 2, కాంగ్రెస్ 11 చోట్ల నెగ్గాయి.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## లిఫ్ట్‌లో అంతరిక్షానికి.. జపాన్ కంపెనీ ప్లాన్!

ఆకాశానికి నిచ్చెన వేయడం అనే అతిశయోక్తిని మనం వింటూంటాం. జపాన్‌కు చెందిన ఒబయాషీ కార్పొరేషన్ సంస్థ నిజంగానే ఆకాశానికి నిచ్చెన వేస్తోంది. మనుషుల్ని రోదసికి లిఫ్ట్‌లో పంపించేలా ప్లాన్ చేస్తోంది. భూమి నుంచి శాటిలైట్ వరకు కేబుల్ వేసి దాని ద్వారా 96వేల కిలోమీటర్ల ఎత్తులోని ఉపగ్రహం వద్దకు చేర్చేలా ప్లాన్ వేసింది. 2050కల్లా దీన్ని సాధ్యం చేయాలని భావిస్తోంది. మొత్తం ప్రాజెక్టు ఖర్చు 100 బిలియన్ డాలర్లు!



## ఎల్లుండి నుంచి అసెంబ్లీ సమావేశాలు

ఈ నెల 21 నుంచి కొత్త అసెంబ్లీ సమావేశాలు రెండు రోజుల పాటు జరగనున్నాయి. సీఎం చంద్రబాబు తర్వాత సభలో సీనియర్ ఎమ్మెల్యే అయిన గోరంట్ల బుచ్చయ్య చౌదరిని ప్రొటెం స్పీకర్‌గా గవర్నర్ రేపు ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఆ తర్వాతి రోజు ఎమ్మెల్యేలతో గోరంట్ల ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఇక 22న స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేస్తారు. తిరిగి జులైలో బడ్జెట్ నిమిత్తం సభ సమావేశమవుతుంది.



## ఈ నెల 21న శ్రీనగర్‌కు మోదీ: కేంద్ర మంత్రి

ఈ నెల 21న ప్రధాని మోదీ జమ్మూకశ్మీర్‌లో పర్యటించనున్నట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీనగర్‌లో జరిగే కార్యక్రమంలో 9వేల మందితో కలిసి యోగా చేస్తారని మీడియాకు తెలిపారు. 20 జిల్లాల నుంచి 2వేల మంది చొప్పున వర్చువల్‌గా పాల్గొనేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది జమ్మూకశ్మీర్‌వ్యాప్తంగా మంచి ప్రభావం చూపిస్తుందని ఆకాంక్షించారు.



## పామాయిల్ ట్యాంకర్ బోల్తా.. బకెట్లతో ఎగబడిన స్థానికులు

పల్నాడు జిల్లా అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపై పామాయిల్ ట్యాంకర్ బోల్తా పడింది. రాజుపాలెం మండలం పెదనెమలిపురి వద్ద ఈ ప్రమాదం జరిగింది.దీంతో అక్కడ భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. నెల్లూరు నుంచి హైదరాబాద్ వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ట్యాంకర్ బోల్తా పడిన విషయాన్ని తెలుసుకున్న స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. ట్యాంకర్ నుంచి పామాయిల్ తీసుకెళ్లేందుకు బిందెలు, బకెట్లతో ఎగబడ్డారు. పోలీసులు అక్కడికి చేరుకుని క్రేన్ సహాయంతో ట్యాంకర్‌ను పక్కకు తొలగించారు.



## హజ్ యాత్రలో 550 మంది యాత్రికులు మృతి

సౌదీలో హజ్ యాత్ర ముగింపు దశకు చేరుకుంది. ఈసారి దాదాపు 550 మంది యాత్రికులు మరణించారని అధికారిక వర్గాలు వెల్లడించాయి. మృతుల్లో అనేక దేశాలకు చెందినవారు ఉన్నారు. ఈజిప్టు దేశానికి చెందినవారే 300కు పైగా ఉన్నట్లు అంచనా. తీవ్ర ఎండలు, ఉక్కపోత వాతావరణమే అందుకు కారణం. మక్కాలో ఉష్ణోగ్రతలు 50 డిగ్రీల సెల్సియస్‌కు చేరింది. ఈసారి యాత్రలో దాదాపు 18.3 లక్షల మంది పాల్గొన్నారని, వారిలో 22 దేశాలకు చెందిన 16 లక్షల మంది ఉన్నారని సౌదీ హజ్ నిర్వాహకులు వెల్లడించారు. మక్కా సమీపంలో ఉన్న అల్-ముయిసెమ్‌లోని ఆసుపత్రిలో మృతదేహాలను ఉంచినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. సంబంధీకులకు అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించాయి. తమ దేశం నుంచి వచ్చిన యాత్రికులు చాలా మంది ఆచూకీ తెలియరావడం లేదని ఈజిప్టు ప్రభుత్వ వర్గాలు హజ్ నిర్వహకులకు తెలియజేశాయి. వారిని గుర్తించేందుకు ముమ్మర చర్యలు చేపట్టినట్లు వెల్లడించాయి. చనిపోయిన వారిలో 60 మంది జోర్డాన్‌వాసులు కూడా ఉన్నారు. గత ఏడాది 240 మరణాలు నమోదయ్యాయి. వీరిలో చాలా మంది ఇండోనేషియాకు చెందినవారు.ఎండ తాపాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్వహకులు అనేక ఏర్పాట్లు చేశారు. యాత్రికులు గొడుగులు వాడాలని, ఎప్పటికప్పుడు నీరు తాగాలని సూచించారు. వారిపై నీళ్లు చిలకరించేలా వాలంటీర్లను నియమించారు. అయినప్పటికీ.. పెద్ద ఎత్తున మరణాలు సంభవించడం గమనార్హం.



## వయనాడ్‌లో గెలిస్తే ప్రియాంక అరుదైన రికార్డు

రాహుల్ గాంధీ ఖాళీ చేసిన వయనాడ్ ఎంపీ స్థానం నుంచి ఆయన సోదరి ప్రియాంకా గాంధీ పోటీ చేయనున్న సంగతి తెలిసిందే. ఈ ఉప ఎన్నికలో ఆమె గెలిస్తే తొలిసారిగా పార్లమెంటులో అడుగుపెట్టనున్నారు. అంతేకాక గాంధీ కుటుంబంలో దక్షిణాది నుంచి గెలిచిన మూడో వ్యక్తిగా చరిత్రకెక్కుతారు. దీంతో పాటు పార్లమెంటులో తొలిసారిగా సోనియా, రాహుల్, ప్రియాంక ఒకేసారి సభ్యులుగా ఉండనున్నారు.

## కెనడా పార్లమెంట్‌లో నిజ్జర్‌కు నివాళి



ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్య విషయంలో భారత్‌తో దౌత్య విభేదాలు కొనసాగుతున్న వేళ కెనడా పార్లమెంట్‌లో అతడికి సంతాపం ప్రకటించడం చర్చనీయాంశమైంది. నిజ్జర్ హత్య జరిగి మంగళవారానికి(జూన్ 18న) ఏడాదైన సందర్భంగా ట్రూడో సర్కారు అతడికి ప్రత్యేకంగా నివాళులర్పించడం గమనార్హం. ఏకంగా దేశ పార్లమెంట్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీలంతా నిలబడి మౌనం పాటించారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి.

## మంత్రి లోకేశ్‌ను కలిశాక గంటలో సమస్య తీరిపోయింది: మహిళ భావోద్వేగం



మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌కు విశేష స్పందన లభిస్తోంది. ఉండవల్లిలోని నివాసంలో బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి మంగళగిరి నియోజకవర్గంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి సమస్యలను విన్నవించుకున్నారు. లోకేశ్ ఓపికగా వారి వినతులు స్వీకరించారు. మంత్రిని కలిశాక తమ సమస్యను వెంటనే పరిష్కరించారని విశాఖ నగరానికి చెందిన మహిళ తెలిపారు. విశాఖకు చెందిన అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు దేవకీదేవి ఎగ్జిబిషన్ గడువు రెన్యూవల్ కోసం గత కొన్ని రోజులుగా ఉన్నతాధికారుల చుట్టూ తిరిగారు. తాము తయారు చేసుకున్న చేతివృత్తుల ఉత్పత్తుల అమ్మకం కోసం అధికారులను గడువు కోరినా ఫలితం దక్కలేదని ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం మంత్రి లోకేశ్‌ను కలిశాక గంటలో సమస్య తీరిపోయిందంటూ దేవకీదేవి భావోద్వేగానికి గురై కన్నీటిపర్యంతమయ్యారు. పారా మెడికల్, ఆర్ఎంపీ, కేజీబీవీ సంఘాల సమస్యలను విని వాటి పరిష్కారానికి లోకేశ్ హామీ ఇచ్చారు. మిగతా జిల్లాల్లోని నేతలు ప్రజాదర్బార్ నిర్వహిస్తే దూర ప్రాంతాల నుంచి అమరావతికి వచ్చే సమస్య ఉండదని ప్రజలు అభిప్రాయపడ్డారు.

## బీజేపీలో చేరిన కిరణ్ చౌదరి

హర్యానాలో కాంగ్రెస్ కు షాక్ ఇచ్చి ఆ పార్టీ నాయకురాలు, తోషమ్ ఎమ్మెల్యే కిరణ్ చౌదరి బిజెపిలో చేరారు. ఆమెతో పాటు తన కూతురు శృతి చౌదరి కూడా బీజేపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు ఢిల్లీలో హర్యానా సీఎం నవాబ్ సింగ్ సైనీసమక్షంలో బీజేపి కండువా కప్పకున్నారు.





## మెస్మరైజ్ చేస్తున్న రాశి ఖన్నా

రాశి ఖన్నా తాజాగా తన గ్లామరస్ లుక్ పోస్ట్ చేసింది. టాప్ టూ బాటమ్ రాశి ఖన్నా గ్లామర్ ప్రదర్శించేలా ఉన్న బ్లాక్ డిజైనర్ శారీలో మెరుపులు మెరిపించింది. రాశి ఖన్నా గమ్మత్తుగా ఇచ్చిన ఫోజులు యువత మైకంలో మునిగిపోతున్నారు. రాశి ఖన్నా అప్పడప్పుడూ క్రేజీ చిత్రాల్లో నటిస్తూనే ఉంది. కానీ సూపర్ హిట్స్ దక్కడం లేదు. చివరగా రాశి ఖన్నాకి తెలుగులో థాంక్యూ, పక్కా కమర్షియల్ లాంటి పరాజయాలు ఎదురయ్యాయి. రాశి ఖన్నా హోమ్లీగా, గ్లామర్ గా మెప్పించగల కొద్దిమంది నటీమణుల్లో ఒకరు. రెండు విధాలుగా కూడా ఆమె అనేక చిత్రాల్లో నటించింది. అలరిపిల్లగా, ఎమోషనల్ గా కూడా మెప్పించింది. రాశి ఖన్నా గ్లామర్ పరంగా తిరుగులేనప్పటికీ విజయాల పరంగా వెనుకంజలోనే ఉంది. రాశి ఖన్నా ప్రస్తుతం పలు తమిళ చిత్రాల్లో నటిస్తోంది. అయితే ఆమెకి ఒక్క తెలుగు చిత్రం కూడా చేతిలో లేదు.



